సాక్షి
కుమురం భీం

గురువారం । 4 । జనవరి । 2024



పండుగకు ప్రత్యేక బస్సులు

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సమాయత్తమవుతోంది. ఆదిలాబాద్ రీజియన్ నుంచి 248 స్పెషల్ బస్సులు నడపనున్నారు. 8లో▸

19,480 దరఖాస్తులు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి బుధవారం జిల్లా వ్యాప్తంగా 19,480 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల సంఖ్య 99,8722కు చేరినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 3,586 ఇతర దరఖాస్తులు రాగా.. వాటి సంఖ్య బుధవారానికి 8620కు చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.2/17.5

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. పొగ మంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి



ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని మహిళలు, యువతులు, విద్యార్థులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. వేధింపులకు గురైనప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో షీటీంకు మూడు ఫిర్యాదులు అందగా, 96 హాట్‌స్పాట్స్‌ను సందర్శించి, 21 అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. విద్యార్థిని వేధించిన ఒకరికి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. చిన్నారుల రక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పోలీసులను నేరుగా సంప్రదించలేని వారు 87126 70564, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

అదనపు తరగతులు నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జైనూర్(ఆసిఫాబాద్): జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు విధిగా అదనపు తరగతులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలు, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీటీడీవో రమాదేవి, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా ఆదర్శ బాలికల పాఠశాలలో వివిధ క్రీడల్లో జోనల్ స్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులకు వారం రోజులపాటు శిక్షణ అందించిన విషయం తెలిసిందే. శిక్షణ అనంతరం బుధవారం విద్యార్థులను ప్రత్యేక బస్సులో రాష్ట్రస్థాయి పోటీలకు పంపించారు. ఈ నెల 4 నుంచి భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో వీరు పాల్గొననున్నారు. మొత్తం 124 మంది బాలికలు, 124 మంది బాలురులకు శిక్షణ అందించినట్లు డీటీడీవో వెల్లడించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, సీసీడీవో శకుంతల, డీఎస్‌వో మీనా రెడ్డి, పీడీలు, పీఈటీలు మధుసూదన్, కృష్ణమూర్తి, లక్ష్మణ్, విద్యాసాగర్, అరవింద్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన' సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో మహేందర్ అన్నారు. సావర్‌ఖేడా, దేవాపూర్, కరంజీవాడ, సుర్దాపూర్ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామ సభల్లో బుధవారం పాల్గొన్నారు. అర్హులైన అన్ని కుటుంబాలు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీ రాజలింగు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తూచ్..అంతా ఒట్టిదే!

'జిల్లాలో ఏ దుకాణంలోనూ ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయాలు చేపట్టరాదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్టు షాపుల తొలగింపుపై సర్కారు నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందలేదు..' ఇది జిల్లా ఎక్సైజ్ అధికారి మాట. గత నెల 19న ఈ మాట చెప్పారు. ఇప్పటికే 15 రోజులు పూర్తయ్యాయి. అయినా మద్యం వ్యాపారులు నిబంధనలేమీ పాటించడం లేదు. యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. బీరు బాటిల్‌పై రూ.10లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదే విషయంపై డిసెంబర్‌లో కొత్త మద్యం దుకాణాలు తెరిచిన నాలుగు రోజులకే మద్యం సిండికేటు వ్యవహారంపై ఓ వ్యక్తి ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆ ఫిర్యాదుపై ఆబ్కారీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి తాటాకు చప్పుళ్లు ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. – సాక్షి, ఆసిఫాబాద్



- మద్యం షాపుల్లో ఎమ్మార్పీకి అమ్మకాల్లేవు..
- నిబంధనలకు విరుద్ధంగా అధికంగా వసూలు
- బెల్టు షాపుల తొలగింపుపైనా నిర్లక్ష్యం
- పట్టించుకోని ఆబ్కారీ అధికారులు

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 32 మద్యం దుకాణాలను వేలంలో వ్యాపారులు దక్కించుకున్నారు. గతేడాది డిసెంబరు 1 నుంచి నూతన షాపులు నిర్వహిస్తున్నారు. మద్యం అమ్మకాలు ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే జిల్లాలో మద్యం వ్యాపారులు సిండికేటుగా మారి.. అదనంగా బాటిల్‌పై రూ.10లు వసూలు చేయడం ప్రారంభించారు. దీనిపై ఓ వ్యక్తి ఏకంగా ఎక్సైజ్ ఉన్నతాధికారులకే ఫిర్యాదు చేయగా.. మద్యం వ్యాపారులు కొన్నాళ్లు గరిష్ట అమ్మకం ధరకే మద్యాన్ని విక్రయించారు. కొన్ని రోజులకు ఫిర్యాదుదారుడు, మద్యం వ్యాపారుల మధ్య రాజీ కుదరడంతో మళ్లీ ధరలు పెంచేసి విక్రయిస్తున్నారు. మద్యం వ్యాపారులు ఎమ్మార్పీ అమ్మకాలకు తిలోదకాలిచ్చినా ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. మద్యం వ్యాపారులు ఇచ్చే మామూళ్ల కారణంగా గరిష్ట అమ్మకపు ధర కచ్చితంగా పాటించాలనే నిబంధనను పాటించడం లేదని తెలుస్తోంది. సీసాపై ముద్రించిన ధరను మించి అమ్ముకునేందుకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బెల్టు షాపులతోనే లాభాలు..!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలినాళ్లలో రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులను రద్దు చేస్తారని ఆ పార్టీ నేతలు ప్రచారం చేశారు. కానీ జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా బెల్టు షాపులు ఉంటే.. ఎక్కడా ఒక్కటంటే ఒక్కటీ తొలగించిన దాఖలాలు లేవు. వాస్తవానికి బెల్టు షాపులనేవి అధికారికంగా ఎక్కడా కనిపించవు. సాక్షాత్తు ముఖ్యమంత్రి తొలగించాలని చెప్పినా.. వీటిని తొలగించే సాహసం ఎక్సైజ్ అధికారులు చేయరనే ప్రచారం ఉంది. మద్యం అమ్మకాలు పెంచుకునేందుకు వ్యాపారులు వీటిని ఏర్పాటు చేసుకున్నారని బహిరంగంగానే చెప్పుకుంటారు. నిబంధనల ప్రకారం వీటిని కొనసాగించకూడదని తెలిసినా.. పట్టించుకునే వారు కరువయ్యారు.

తీసేస్తే పరిస్థితి ఏంటి?

బెల్టు షాపులను తొలగిస్తే పరిస్థితి ఏంటి?.. దుకాణాల్లో అమ్మకాలు పూర్తిగా పడిపోతాయా? అనే కోణంలో ఎక్సైజ్ శాఖ ఆలోచిస్తోంది. గతేడాది జరిగిన ఎక్సైజ్ వేలంలో దుకాణాల కోసం దరఖాస్తులు చాలా తక్కువ వచ్చాయనేది అభిప్రాయం ఉంది. ఫలితంగా డిపాజిట్ల రూపంలో సర్కారు ఖజానాకు జమయ్యే ఆదాయం కూడా తగ్గిందనే అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో పార్లమెంట్ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఈ ఏడాదిలో రానున్నాయి. దీంతో అమ్మకాలు పెంచుకునే అవకాశం ఉంటుంది. వీటన్నిటిపై గణాంకాలు తయారు చేశారు. ఒకవేళ బెల్టు షాపులను కచ్చితంగా తొలగించాలని నిర్ణయం తీసుకుంటే వాటిని తొలగించాల్సి వస్తుంది. ఆ ఊసే లేకపోతే, ఎప్పటి తీరునే.. బెల్టు షాపులు యథేచ్ఛగా కొనసాగనున్నాయి.

ఫిర్యాదుల్లేవు..

జిల్లాలో మద్యం దుకాణాల్లో గరిష్ట అమ్మకం ధరను మించి విక్రయాలు జరుగుతున్నట్లు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. సిండికేటు అంశం నా దృష్టికి రాలేదు. ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇక బెల్టు షాపుల తొలగింపు విషయమై తమకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందితే వెంటనే చర్యలు తీసుకుంటాం.
– జ్యోతి కిరణ్, జిల్లా ఎక్సైజ్ అధికారి

ఏసీబీ.. మళ్లీ దాడులకు సిద్ధం!

- లంచగొండులపై నిఘా
- ఆదాయానికి మించి ఆస్తులుంటే ఆరా
- పూర్వవైభవం దిశగా కసరత్తు



సాక్షి, ఆసిఫాబాద్: ఎన్నికల నియమావళి అమల్లో ఉండటం.. సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడం.. తదితర కారణాలతో ప్రభుత్వ శాఖల్లో పనులు నత్తనడకన జరగడంతో ఇటీవల అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) జోరు తగ్గింది. ప్రజల నుంచి పెద్దగా ఫిర్యాదులు కూడా లేకపోవడంతో కేసుల కోసం తడుముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎన్నికలు ముగిశాయి.. కొత్త సర్కారు కొలువుదీరింది. పరిపాలన మళ్లీ గాడిన పడింది. ఏసీబీ బాస్‌గా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టాక.. ఏసీబీకి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో ఏసీబీ అధికారులు మళ్లీ దాడులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఫిర్యాదులతోపాటు సొంతంగా దాడులు చేసేందుకు అవకాశమున్న 'ఆదాయానికి మించి ఆస్తులు' కేసులపై ఈ విభాగం దృష్టి సారిస్తోంది.

ఎన్నికలతో విరామం..

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటివరకు రెండు ఏసీబీ దాడులు జరిగాయి. రెబ్బెన మండల సర్వేయర్, చైన్‌మెన్ రూ.10 వేలు, రూ.20 వేల లంచం తీసుకొంటూ చింతలమానెపల్లి ఎస్సై ఏసీబీకి దొరికిపోయారు. ఆ తర్వాత మళ్లీ ఏసీబీ దాడులు నమోదు కాలేదు. అసెంబ్లీ ఎన్నికల పర్వంతో రెవెన్యూ, పోలీసు, రవాణా, రిజిస్ట్రేషన్లు, పౌరసరఫరాలు తదితర కీలక శాఖల సిబ్బంది ఆ విధుల్లో మునిగిపోయారు. పింఛన్లు, భూముల పట్టాల మంజూరు, వివిధ రకాల అనుమతుల ప్రక్రియలు మందగించాయి. ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాల్లో పనులన్నీ దాదాపు స్తంభించాయి. దీని వల్ల ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు కూడా చాలా తగ్గాయని ఏసీబీ సిబ్బంది చెబుతున్నారు. ఫిర్యాదుల ఆధారంగానే ఉద్యోగులపై నిఘా పెట్టి వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడానికి వీలవుతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, లంచాల కోసం ఎవరైనా డిమాండ్ చేసినా తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు కోరుతున్నారు.

'వారి'పై ప్రత్యేక దృష్టి..

ప్రస్తుతం ఫిర్యాదులు(ట్రాప్)లతో పాటు ఆదాయానికి మించి ఆస్తులు(డీఏ) కలిగి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏసీబీ భావిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో లెక్కకు మిక్కిలిగా సంపాదించుకుంటున్న సిబ్బంది, బినామీ పేర్లతో ఆస్తులు వెనకేసుకున్న ఉద్యోగులు, ఇక్కడే ఏళ్ల తరబడి తిష్ట వేసి, పాడి ఆవుల్లాంటి విభాగాల్లో పాతుకుపోయిన అధికారులు, ఉద్యోగులపై ఈ విభాగం దృష్టి సారిస్తోంది. అవినీతికి బానిసలైన అధికారుల అక్రమ ఆస్తులపై, బినామీలపై ఏసీబీ రహస్యంగా నిఘా వేయనున్నట్లు సమాచారం.

'ఓటరు జాబితా సవరణ' పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం– 2024 పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు కదం సురేశ్, కాసబోయిన సురేశ్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు. రేషనలైజేషన్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు కిలోమీటర్ల పరిధి దాటిన ప్రాంతాల్లో వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో 27, ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో 52 సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ నెల 20, 21వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సాంఘిక సంక్షేమ గురుకులాల అధికారులతో కలిసి ప్రవేశ పరీక్షకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఎంపిక పాత ఉమ్మడి జిల్లా యూనిట్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని, ఇందుకు సంబంధించి ధ్రువపత్రాలు జతపర్చాలని సూచించారు. వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్ 1800 425 45678, ఆన్‌లైన్‌లో సంప్రదించవచ్చన్నారు. ఇంగ్లిష్ మీడియంలో మెరుగైన విద్య అందుబాటులో ఉందని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో స్వరూపారాణి, డీసీవో బాలరాజు, ప్రిన్సిపాళ్లు సంధ్యారాణి, జ్యోతి, శ్రీనాథ్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తాం

- డీఎంహెచ్‌వో తుకారాం



భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రజల అవసరాల కోసం ఆరోగ్య ఉప కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ అన్నారు. మండలంలోని నిషాని గ్రామంలో పదేళ్ల క్రితం నిర్మించిన ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం పూర్తయినా ఇప్పటికీ ఆరోగ్య శాఖకు అప్పగించలేదని స్పష్టం చేశారు. నిషాని గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ లేదని, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు త్వరలోనే సబ్ సెంటర్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల గ్రామస్తులు భవనం ఉన్నా సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఆదేశాలతో గ్రామాన్ని సందర్శించామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఆదిమ గిరిజనుల గురించి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం పీవీటీజీల అభివృద్ధికి కోసం తీసుకువచ్చిన పీఎం జన్‌మన్ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, వైద్యాధికారి దినేశ్, సిబ్బంది ఖలీల్ హుస్సేన్, రషీద్, శ్యాంలాల్, పంచాయతీ కార్యదర్శి విలాస్ ఉన్నారు.

డార్ఫ్ వర్ధంతికి ఆహ్వానం



ఆహ్వానం అందిస్తున్న మార్లవాయి గ్రామస్తులు

జైనూర్(ఆసిఫాబాద్): ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మార్లవాయి గ్రామస్తులు ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రం అందించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు ఉప ముఖ్యమంత్రికి మార్లవాయి గ్రామ చరిత్ర, ఆదివాసీల అభ్యున్నతికి ప్రొఫెసర్ డార్ఫ్ దంపతులు చేసిన కృషిని వివరించారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, హైమన్ డార్ఫ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు కనక వెంకటేశ్, సర్పంచ్ ప్రతిభ, ఉప సర్పంచ్ సాయిత్రీ ధర్మేందర్, సార్‌మెడి దేవ్‌రావు తదితరులు ఉన్నారు.

'గృహలక్ష్మి' రద్దు

- పథకాన్ని రద్దు చేస్తూ కాంగ్రెస్ సర్కారు ఉత్తర్వులు
- ఎన్నికల ముందు జిల్లావ్యాప్తంగా 45,046 దరఖాస్తులు
- అర్హుల గుర్తింపు ప్రక్రియ సైతం పూర్తి
- ప్రస్తుతం 'ప్రజాపాలన'లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్జీలు



కౌటాలలో లబ్ధిదారుల ఎంపికకు సర్వే(ఫైల్)

కౌటాల(సిర్పూర్): పేదల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం స్థలం, నిధుల కొరతతో లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు దక్కలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సొంతంగా స్థలం ఉండి, ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి చేయూతనివ్వాలని గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. కొత్తగా అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తోంది. గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి మూడు వేల గృహాలు మంజూరు చేసినట్లు ప్రకటించింది. ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రూ.లక్ష చొప్పున మూడు సార్లు అందిస్తామని ప్రకటించారు. ఆగస్టులో 7 నుంచి 10 వరకు దరఖాస్తులు స్వీకరించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పంచాయతీ అధికారులు పరిశీలన సైతం పూర్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పాత దరఖాస్తులు వృథాగా మారనున్నాయి.

45,046 దరఖాస్తులు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో గృహలక్ష్మి పథకం కోసం 45,046 దరఖాస్తులు వచ్చాయి. వాటిని అధికారులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఆగస్టులో క్షేత్రస్థాయిలో ఆరా తీసి 31,602 మందిని అర్హులుగా గుర్తించారు. వీరి వివరాలన్నీ ఇంటర్‌నెట్‌లో అప్‌లోడ్ చేసి అర్హులైన వారికి అధికారులు ఉత్తర్వులు కూడా పంపిణీ చేశారు. జిల్లాలో మొదటి విడత గృహలక్ష్మి పథకానికి 5400 యూనిట్లు మంజూరు చేశారు. ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతంగా జీవోలో పేర్కొన్నారు. మిగతావి జనరల్, దివ్యాంగులకు ఇస్తామని అధికారులు తెలిపారు. 335 గ్రామ పంచాయతీల్లో 160కి పైగా పంచాయతీలు ఏజెన్సీ ప్రాంతాలే ఉండడంతో గృహలక్ష్మి పథకానికి ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతరులు వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో కేవలం గిరిజనులనే ఎంపిక చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు తమకు అనుకూలంగా ఉండే వారికి మాత్రమే గృహలక్ష్మి పథకానికి అర్హులుగా ఎమ్మెల్యేలు ఎంపిక చేశారనే ఆరోపణలు వచ్చాయి.

పేదలకు అనవసర ఖర్చు

గృహలక్ష్మి పథకంలో జిల్లావ్యాప్తంగా గతేడాది ఆగస్టులో ఆగమేఘాల మీద ప్రజల వద్ద నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రక్రియలో మొదట ఆన్‌లైన్ నుంచి పొందిన దరఖాస్తులను పూర్తి చేసి దరఖాస్తుదారులు అధికారులకు అందించారు. తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ఫొటోతో ప్రభుత్వం ప్రత్యేక గృహలక్ష్మి దరఖాస్తుల నమూనా విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శులు మళ్లీ దరఖాస్తుదారులు ఇచ్చిన దరఖాస్తుల్లోని వివరాలను ప్రభుత్వం జారీ చేసిన ఫారాల్లో నింపి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వాటి పరిశీలన, అర్హుల ఎంపిక దాదాపు పూర్తయ్యింది. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. అప్పుడు గృహలక్ష్మి పథకానికి కావాల్సిన పత్రాల కోసం ఒక్కొక్కరు రూ.500 నుంచి రూ.100 వరకు ఖర్చు చేశారు. అష్టకష్టాలు పడి దరఖాస్తు చేసిన గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది.

ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టింది. డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం రూపొందించిన నిర్ణీత దరఖాస్తు ఫారంలోనే మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారులు అర్జీలు పరిశీలించి రశీదు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు అభయహస్తం దరఖాస్తులు 99,8722 వరకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పక్కా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నామని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారిని శరవేగంగా గుర్తించి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సావిత్రీబాయి పూలే ఆశయాలు కొనసాగిద్దాం



బీసీ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



జైభీం సేన ఆధ్వర్యంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: చదువుల తల్లి.. సావిత్రీబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కోట వెంకన్న, వైరాగడె మారుతి పటేల్, జక్కయ్య, ఆవిడపు ప్రణయ్, ప్రశాంత్, కమలాకర్, శ్యాంరావ్, సాగర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద జైభీం సేన ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్, నాయకులు మారుతి, హన్మంతు, బిక్కు, పెంటయ్య, చంద్రి, అనిల్, అజిత్, సుభాశ్, గోపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాది సంగీతకు ఐకాన్ అవార్డు


అవార్డుతో సంగీత

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన మహిళా న్యాయవాది నల్లుల సంగీత అంతర్జాతీయ ఐకాన్ అవార్డు అందుకున్నారు. బుధవారం పూలే జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్, ఎంబీసీ, డీఎన్‌టీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన 193 మందికి ఐకాన్ అవార్డులు ప్రదానం చేశారు. మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా సంగీత అవార్డు అందుకున్నారు.

ఆర్మీ బాయ్స్ స్పోర్ట్ కంపెనీ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఆల్ ఇండియా ఓపెన్ సెలక్షన్స్, అడ్మిషన్ల కోసం ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు విద్యార్థులకు క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, మద్రాస్ ఇంజనీర్ గ్రూప్ సెంటర్, బెంగళూరు వారిచే బాక్సింగ్, హాకీ, స్విమ్మింగ్, సెయిలింగ్ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ప్రమాదవశాత్తు సామగ్రి దగ్ధం


కాలిన ఇంటి సామగ్రి

జైనూర్: మండలంలోని మాని కొలాంగూడలో ఆత్రం మారు అనే రైతు ఇంట్లో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 5 క్వింటాళ్ల పత్తి, ఇంట్లోని సామగ్రి దగ్ధమయ్యాయి. గమనించిన గ్రామస్తులు మంటలు అదుపు చేశారు. ఎస్సై సందీప్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దీపాదాస్ మున్షీకి పీఎస్సార్ సన్మానం


దీపాదాస్ మున్షీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) బుధవారం హైదరాబద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు.

జిల్లా అటవీ అధికారిని కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా టీఎన్జీవోస్ సభ్యులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా ఫారెస్టు అధికారి శివ్ ఆశిష్ సింగ్, ఏసీఎఫ్ ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహులను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, అటవీశాఖ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, సంయుక్త కార్యదర్శి వెంకటకృష్ణ, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, సభ్యులు రవికిరణ్ పాల్గొన్నారు.

పండుగకు ప్రత్యేక బస్సులు

- సంక్రాంతికి ఆదిలాబాద్ రీజియన్ నుంచి సౌకర్యం
- ఈ నెల 7 నుంచి 13 వరకు 248 స్పెషల్ బస్సులు


మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సంస్థను లాభాల బాటలోకి తెచ్చేందుకు యాజమాన్యం అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సమాయత్తమవుతోంది. సంక్రాంతికి విద్యార్థులకు సెలవులు వస్తున్నాయి. దైవదర్శనాలు, పండుగ సందళ్లు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో రాకపోకలు పెరుగనున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, వారి సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వెళ్లినవారు.. చదువుల నిమిత్తం నగరంలో ఉన్న విద్యార్థులంతా సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ 248 ప్రత్యేక (స్పెషల్ బస్సులు) బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది.

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు ప్రత్యేక బస్సుల వివరాలు (డిపోలవారీగా)

తేదీ	ఆదిలాబాద్	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	07	2	0	02	02
08	02	04	0	02	04
09	02	03	0	02	03
10	02	05	0	02	05
11	15	24	02	10	20
12	15	24	02	10	20
13	10	20	02	10	20

ఈ నెల 7 నుంచి 13 వరకు..

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఉట్నూర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. భైంసా డిపో నుంచి మినహాయిస్తే మిగిలిన ఐదు డిపోల వారీగా బస్సుల రాకపోకలు సాగనున్నాయి. ఈ నెల 7 నుంచి 13 వరకు ఆయా డిపోలనుంచి జేబీఎస్ వరకు ఆర్టీసీ బస్సులు నడుపనున్నారు. ఆదిలాబాద్ డిపో నుంచి 48, నిర్మల్ డిపో నుంచి 82, ఉట్నూర్ డిపో నుంచి 06, ఆసిఫాబాద్ డిపో నుంచి 38, మంచిర్యాల డిపో నుంచి 74 బస్సులను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు బస్సుల సమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఈ నెల 7న 08, 8న 12, 9న 10, 10న 14, 11న 71, 12న 71, 13న 62 బస్సులు నడుపనున్నారు.

మరిన్ని బస్సులు నడిపే అవకాశం



పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే మరిన్ని ప్రత్యేక బస్సులు నడిపే అవకాశం ఉంది. స్పెషల్ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి.
– సోలోమన్, రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

నిస్వార్థ సేవకు గుర్తింపు

- సావిత్రీబాయి పూలే అవార్డుకు కడేర్ల వీణ ఎంపిక
- పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన
- ఈ నెల 7న నాగ్‌పూర్‌లో ప్రదానం


కడేర్ల వీణ

కెరమెరి(ఆసిఫాబాద్): నిస్వార్థ సేవకు గుర్తింపు దక్కింది. వందలాది మంది విద్యార్థులకు అక్షర జ్ఞానం అందిస్తూ.. పదేళ్లుగా ఉచిత బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు కడేర్ల వీణ మరో గౌరవం అందుకోనున్నారు. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం సావర్‌ఖేడా ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రంగయ్య సతీమణి వీణ భర్త అడుగుజాడల్లో నడుస్తూ స్వచ్ఛంద సేవల్లో పాలు పంచుకుంటున్నారు. పైసా ప్రతిఫలం ఆశించకుండా పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా బోధిస్తోంది. వీణ సేవలను గుర్తించిన శ్రీ క్షత్రియ కోసరి మాలి సమాజ్(విదార్భ) ఆమెను సావిత్రీబాయి పూలే అవార్డుకు ఎంపిక చేసింది. పదేళ్లుగా ఉచిత బోధన, సావర్‌ఖేడాలో నివాసం ఉండటం, తెలుగు భాషపై విద్యార్థులకు పరిజ్ఞానం పెంచడం, అక్షరాస్యత పెంపునకు కృషి చేయడం, సెలవు రోజుల్లో కూడా ఇంటి వద్ద బోధన సాగించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని విద్యారంలో స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా అవార్డు అందించనున్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ నెల 7న జరిగే కార్యక్రమానికి వీణకు ఆహ్వానం పంపించారు. విద్యారంగంలో స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా సావర్‌ఖేడా పాఠశాలలో పని చేస్తున్న వీణ.. సావిత్రీబాయి పూలే అవార్డుకు ఎంపికైనట్లు మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెట్కులే సుకుమార్ బుధవారం 'సాక్షి'కి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న 36 మంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేసి, సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'సింగరేణికి విముక్తి కలిగింది'

- బీఎంఎస్ అధ్యక్షుడు సత్తయ్య


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో చాలా కాలంగా తిష్టవేసిన సీఎండీ శ్రీధర్‌ను బదిలీ చేయడంతో సంస్థకు విముక్తి కలిగిందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆయన బదిలీపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం నస్పూర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల నుంచి సింగరేణిలో తిష్ట వేసి కంపెనీలో అనేక చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడ్డారన్నారు. రాజకీయ జోక్యంతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేయించారన్నారు. దీన్ని ప్రశ్నిస్తున్న తమ లాంటి సంఘం నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఆయన పదవీ కాలంలో కంపెనీలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి నుంచి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులు ఎక్కడికి వెళ్లాయో లోతుగా విచారణ చేస్తే అసలు విషయాలు వెల్లడవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు అల్లంకి వసంతరావు, పాగిడి శ్రీకాంత్, కమలాకర్, కాంపల్లి తిరుపతి, మంచాల రమేష్, మోహన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ఆదర్శనీయం

- జీఎం సంజీవరెడ్డి


బహుమతులు పొందిన వారితో జీఎం

శ్రీరాంపూర్: చదువు ప్రాముఖ్యతను చాటిన సావిత్రీబాయి పూలే జీవితం మహిళలందరికీ ఆదర్శనీయమని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బీ.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పూలే 193వ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు విద్య అందించాలని ఉద్యమం చేసిన వారిలో సావిత్రిబాయి పూలే మొదటి మహిళ అన్నారు. అనంతరం ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి మాట్లాడుతూ సింగరేణిలో మహిళల అభ్యున్నతికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందన్నారు. జీఎం కార్యాలయంలోని మహిళలకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పూలే వేషధారణలో కుమారి నిర్మలాదేవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం కే.రఘుకుమార్ దంపతులతో పాటు ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, ఎస్సీ లైసెన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ఏరియా సర్వే అధికారి వెంకటేశ్, లా మేనేజర్ శిరీషా రెడ్డి, లా ఆఫీసర్ ప్రబంధిత, డెప్యూటీ పర్సనల్ మేనేజర్ ఎం రాజేశ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నెన్నెల: ఈ నెల 1న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి శ్రీకాంత్ (29) ఈనెల 1న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మనస్తాపంతో బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నంబాలకు చెందిన శ్రీరామోజు మౌనిక (31)కు గోదావరిఖనికి చెందిన క్రిష్ణమాచారితో వివాహమైంది. దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. మౌనిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్తాపం చెందింది. ఈ నెల 1న నంబాలలోని పుట్టింటికి వచ్చింది. బుధవారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న పాత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి గోడ కూలి ఇద్దరికి గాయాలు

బెజ్జూర్: ఇంటి గోడ కూలి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన ఎగ్గి సత్యనారాయణ, కమల దంపతులు బుధవారం ఇంట్లో పనిలో నిమగ్నమై ఉండగా ఇంటి గోడ దంపతులిద్దరిపై కూలింది. విషయాన్ని ఇంట్లోని ఇద్దరు పిల్లలు వెళ్లి స్థానికులకు చెప్పడంతో వారిని బయటకు తీశారు. కమలకు వెన్నుపూసలో దెబ్బ తగలడంతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


సంఘటన స్థలంలో మృతదేహం

సిర్పూర్(టి): విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పారిగాం గ్రామానికి చెందిన నాగపురి రమేశ్ (54) బుధవారం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పంటకు నీరందించేందుకు వెళ్లాడు. మోటార్ నుంచి నీళ్లు రాకపోవడంతో 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య మాయాబాయి, కుమారుడు ఆకాశ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి

లక్సెట్టిపేట: ట్రాక్టర్ పైనుంచి కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన తీగల నరేష్ (34) ఎల్లారంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం పొలంలో దున్నుతుండగా అదుపుతప్పి ట్రాక్టర్ పైనుంచి కిందపడ్డాడు. తలకు వీల్స్ బలంగా తాకడంతో గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

పెన్షన్ పెంపుదలకు కృషి చేయాలి


వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగుల పెన్షన్ పెంపుదలకు కృషి చేయాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.వేణుమాధవ్, సంయుక్త కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ 1998లో పెన్షన్ చట్టం వచ్చిన తర్వాత మూడేళ్లకోసారి పెన్షన్ సమీక్షించి పెంపుదల చేయాల్సి ఉన్నా ఇప్పటికీ ఆ నిబంధనను అమలు చేయడం లేదన్నారు. చాలీచాలని పెన్షన్‌తో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. జూలై 1, 2016 నుంచి పెరిగిన రూ.20 లక్షల గ్రాట్యుటీ సీలింగ్‌ను అమలు చేయాలని, తెలంగాణలోని ప్రముఖ నగరాల్లో రిటైర్డ్ ఉద్యోగుల కోసం కంపెనీ మందులు ఇవ్వడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయించాలని కోరారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచిన సందర్భంగా సీతారామయ్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే.రాజకుమార్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ హామీలు అమలు చేయాలి'


మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు కోరారు. బుధవారం ఆర్కే 6 గనిపై మాట్లాడుతూ శ్రీరాంపూర్, తదితర ప్రాంతాల్లో టీబీజీకేఎస్, ఏఐటీయూసీ చీకటి ఒప్పందం చేసుకుని ఐఎన్టీయూసీని ఓడించాయన్నారు. ఓడినా, గెలిచినా తామెప్పుడూ కార్మికుల పక్షానే ఉండి పని చేస్తామన్నారు. కార్మికులకు ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం వంటి హామీలను ఏఐటీయూసీ వెంటనే అమలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యాం, జాతీయ సమితి సభ్యులు భీంరావు, నాయకులు ల్యాగల శ్రీనివాస్, వెంకటస్వామి, విజయపాల్‌రెడ్డి, సంతోశ్, సత్తయ్య, జె.నర్సింగ్, ప్రవీణ్‌రాజ్ పాల్గొన్నారు.

టో(తో)ల్ తీస్తున్నారు..

- ఫాస్ట్ టాగ్ లేదని డబుల్ జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మందమర్రి టోల్ ప్లాజా నిర్వాహకులు వాహనదారులను దోపిడీ చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా ఇక్కడ కనిపిస్తున్న టోల్ చీటీలే.. అవును కరీంనగర్ నుంచి వచ్చిన ఓ కారు బెల్లంపల్లి వైపు వెళ్తుండగా మందమర్రి టోల్ ప్లాజా వద్ద కారుకు ఫాస్ట్ టాగ్ లేదని నగదు వరసలో వెళ్లగా ఎగువకు రూ.70తో పాటు అదనంగా రూ.70 జరిమానాతో కలిపి మొత్తం రూ.140 వసూలు చేశారు. తిరుగు ప్రయాణంలో రెండు గంటల అనంతరం మందమర్రి టోల్ ప్లాజాకు రాగానే టోల్ ఫీజు కింద రూ.70, ఫాస్ట్ టాగ్ లేదని రూ.70 అదనంగా మళ్లీ రూ.140 వసూలు చేశారు. అలాగే అదే కారు వెళ్లేటప్పుడు 1,200 కిలోల బరువు చూపించగా తిరుగు ప్రయాణంలో 950 కిలోలు చూపించింది. ఇక రెండు గంటల వ్యవధిలో టోల్ ఫీజుతో పాటు ఫాస్ట్ టాగ్ లేదని రూ.240 వసూలు చేశారని ప్రయాణికుడు హరి టోల్ ప్లాజా నిర్వాహకులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. నిర్వాహకులను అడిగితే 'ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను అడుక్కోండి' అనడం కొసమెరుపు.

దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలి


దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లక్సెట్టిపేట: ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేట, మున్సిపల్ పరిధిలోని 9, 14వ వార్డుల్లో పర్యటించి దరఖాస్తులు పరిశీలించారు. లబ్ధిదారులు అందించే దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి తీసుకోవాలని, రశీదులు అందజేయాలని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు ఉండకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఎండీవో నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవేంద్ర రావు, ఎంపీవో ప్రసాద్ పాల్గొన్నారు.

'అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి'


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం కోఆపరేటివ్ సొసైటీ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలని ఎస్పీఎం పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2023 అక్టోబర్ 10న సొసైటీలో కార్మికులకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేయగా జిల్లా సహకార సంఘం అధికారి తారామణి స్పందించి నవంబర్ 18న అసిస్టెంట్ రిజిస్ట్రార్ సామ్యూల్ మాథ్యూను విచారణకు ఆదేశించారన్నారు. బుధవారం ఎస్పీఎంలో పనిచేస్తున్న సొసైటీ బాధ్యులు రమేశ్‌కు సహకారం సంఘం తరపున సదానందం మెమో జారీ చేశారన్నారు. 2014 నుంచి సొసైటీలో జరిగిన లావాదేవీలు, బ్యాంకు అకౌంట్లు అన్ని సమర్పించాలని ఆదేశించారన్నారు. నూతన ప్రభుత్వంపై తాము పూర్తిన మ్మకంతో ఉన్నామని, విచారణ సవ్యంగా జరిగి కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు.సమావేశంలో సూర్యప్రకాశ్‌రావు, ఎకె సింగ్, శంకరయ్య, షబ్బీర్, రవి, సునీల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయినులకు సన్మానం


సన్మానం పొందిన ఉపాధ్యాయినులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బుధవారం సావిత్రీ బాయి పూలే జయంతి నిర్వహించారు. పట్టణ పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ టీ.సత్యనారాయణ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. 11 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఉపాధ్యాయినులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అకిరెడ్డి శంకర్, నాయకులు తొంగల రాజేశం, తొంగల శ్రీనివాస్, బగ్గని శేషుకుమార్, కందుల రాజన్న, యువజన నాయకులు సాగర్ వర్మ, మీస రమేష్, అచ్చ శివ పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వరకు గడువు పొడిగించారని, నూతన, రెన్యువల్ ఉపకార వేతనాల కోసం విద్యార్థులు కులం, ఆదాయంతోపాటు ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నూతన, రెన్యువల్ ఉపకార వేతనాల దరఖాస్తుల హార్డ్ కాపీలను కళాశాలల యాజమాన్యాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందించాలని, విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో www:// telanganaepass. cgg. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

న్యాయం చేయాలని 'భట్టి'ని కోరిన శేజల్


డెప్యూటీ సీఎంతో గోడు వెల్లబోసుకుంటున్న శేజల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఆరిజిన్ డెయిరీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏఓ) బోడపాటి శేజల్ డెప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బుధవారం సచివాలయంలో ఆయనను కలిసి తనపై జరిగిన ఘటనలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య లైంగిక వేధింపులకు గురి చేయడంతోపాటు తమపై దాడులు చేయిస్తున్నారని తెలిపారు. దాడులు చేయించిన మాజీ ఎమ్మెల్యేతోపాటు అతని అనుచరులను అరెస్టు చేయించాలని వేడుకున్నారు. చిన్నయ్య తమపై పెట్టించిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు.

నిషేధాజ్ఞలు పొడగింపు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఇదివరకే అమలులో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 1నుంచి ఫిబ్రవరి 1వరకు పొడగించినట్లు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, అనుమతి లేకుండా డీజే సౌండ్స్, డ్రోన్ కెమెరాలు వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు.